

నిలిచిన డిగ్రీ ప్రాక్టికల్స్
ఎంజీయూ పరిధిలోని ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా బుధవారం డిగ్రీ ప్రాక్టికల్ పరీక్షలు నిలిచిపోయాయి. - 8లో



ఈతకు వెళ్లి బీటెక్ విద్యార్థి మృతి
ఈతకు వెళ్లిన బీటెక్ విద్యార్థి ఒకరు క్వారీ గుంతలో మునిగి మృతిచెందారు. మరో విద్యార్థి గల్లంతయ్యాడు. - 8లో



రాజ్యాంగ పరిరక్షణ.. బాధ్యత
రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని వికలాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

ముగిసిన పదో తరగతి పరీక్షలు

సూర్యాపేట టౌన్: గతనెల 21న ప్రారంభమైన పదో తరగతి వార్షిక పరీక్షలు బుధవారం ముగిశాయి. జిల్లాలో మొత్తం 67 కేంద్రాల్లో ఉదయం 9:30గంటల నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు ఒక్కో పరీక్ష నిర్వహించారు. చివరి రోజు సోషల్ స్టడీస్ పరీక్షకు 11,912 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 11,885 మంది హాజరు కాగా, 27 మంది గైర్హాజరయ్యారు. 11 మంది ప్రైవేట్ విద్యార్థులకు గాను 8 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను బుధవారం స్టేట్ ప్రాజెక్టు అడిషనల్ డైరెక్టర్, సమగ్ర శిక్ష అధికారి రాధారెడ్డితోపాటు నాలుగు స్క్వాడ్ బృందాలు, డీఈఓ తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని డీఈఓ అశోక్ తెలిపారు. అలాగే గురువారం ఒకేషనల్ విద్యార్థులకు 13 సెంటర్లలో పరీక్ష జరుగుతుందని చెప్పారు.

ప్రజా భద్రత కోసమే పోలీస్ వ్యవస్థ



పోలీస్ ప్రజా భరోసాలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ జనార్దన్

చివ్వెంల: ప్రజా భద్రత కోసమే పోలీస్ వ్యవస్థ పనిచేస్తోందని జిల్లా అదనపు ఎస్పీ ఏఆర్.జనార్దన్ అన్నారు. బుధవారం రాత్రి చివ్వెంల మండలం ఎంజీనగర్ తండాలో నిర్వహించిన పోలీస్ ప్రజా భద్రత కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో అల్లర్లు, సమస్యలు సృష్టించే వారిని బైండోవర్ చేస్తామన్నారు. యువత బెట్టింగ్‌లు పెట్టి అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకోవద్దన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌లు మహేశ్వర్, కనకరత్నం, గ్రామ పోలీస్ అధికారి ఎం.సురేష్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సూర్యాపేట డీఎస్పీగా పార్థసారథి



సూర్యాపేట టౌన్: సూర్యాపేట డీఎస్పీ పార్థసారథిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం ఆయన డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం వరంగల్ ఎస్బీ ఏసీపీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. కాగా ఇక్కడ పనిచేసిన డీఎస్పీ రవి ఇటీవల డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే.

వైభవంగా గరుడ వాహనసేవ



గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో బుధవారం నిత్యారాధనలు కొనసాగాయి. శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఊరేగించారు. ఆ తర్వాత భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వడ్లకు మద్దతు అందట్లే!

- ఎక్కడా దక్కని రూ.2,320 ప్రభుత్వ మద్దతు
- గ్రామాల్లో ప్రారంభంకాని కొనుగోలు కేంద్రాలు
- ఇదే అదనుగా ధర తగ్గించి కొంటున్న వ్యాపారులు
- క్వింటాకు రూ.300 నుంచి రూ.500 వరకు నష్టపోతున్న రైతులు

క్వింటాకు రూ.2వేలలోపే పలుకుతున్న ధర



తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం రాశులు

తిరుమలగిరి (తుంగతుర్తి): ఈ యాసంగి సీజన్‌లో అరుగాలం శ్రమించి వరిధాన్యం పండించిన అన్నదాతలకు మద్దతు ధర అందని ద్రాక్షగా మారింది. గతంలో ఎన్నడూలేని విధంగా భూగర్భ జలాలు అడుగంటడంతో వందలాది ఎకరాలలో వేసిన పంట ఎండిపోయింది. వేసిన పంటలో సగం చేతికొచ్చే స్థితిలో లేదని, వచ్చిన కొద్దిపాటి దిగుబడినైనా అమ్ముకుందామంటే ఒకవైపు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభంకాక, మరోవైపు మద్దతు ధర అందడం లేదని రైతులు వాపోతున్నారు. తుంగతుర్తి నియోజకవర్గంతోపాటు చుట్టుపక్కల ఉన్న వివిధ ప్రాంతాల్లో పదిహేను రోజుల నుంచి వరికోతలు ప్రారంభమయ్యాయి. తిరుమలగిరి మార్కెట్‌కు, మిల్లులకు రైతులు ధాన్యం తీసుకొస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మాత్రం క్వింటాకు రూ.2,320 ఉండగా ప్రైవేట్ వ్యాపారులు, మిల్లర్లు మాత్రం రూ.1,600 నుంచి రూ.2వేలలోపే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతనెల 15 నుంచే ధాన్యం రాక..

తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు గతనెల 15వ తేదీ నుంచి బుధవారం వరకు 37 వేల బస్తాల ధాన్యం వచ్చింది. క్వింటాకు గరిష్టంగా రూ.1,953, కనిష్టంగా రూ.1,650 ధర పడుతోంది. ఇందులో అధిక ధాన్యం రూ.1,700 నుంచి రూ.1,850 ధరలు పలుకుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. అలాగే మిల్లుల వద్ద కూడా క్వింటాకు రూ.1,900లోపే కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా మన జిల్లాలో తుంగతుర్తి పరిసర ప్రాంతాలతోపాటు పక్కజిల్లా అయిన జనగామ జిల్లా నుంచి ధాన్యం తరలివస్తోంది. బుధవారం ఒక్కరోజే 21,290 బస్తాల ధాన్యం వచ్చినట్లు మార్కెట్ సిబ్బంది పేర్కొన్నారు. నాలుగు రోజుల సెలవుల అనంతరం బుధవారం ఒక్కరోజే భారీగా ధాన్యం రావడంతో వ్యాపారులు ధర తగ్గించి కొనుగోలు చేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలు లేక..

గ్రామాల్లో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో రైతులు మార్కెట్‌కు, మిల్లులకు ధాన్యాన్ని తీసుకొస్తున్నారు. దీనికితోడు ఇళ్లలో ధాన్యాన్ని నిల్వ చేసుకునే సామర్థ్యం లేక పోవడం, ఆర్థిక ఇబ్బందుల కారణాలు, వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో కోసిన ధాన్యాన్ని వెంటనే రైతన్నలు మార్కెట్, మిల్లుల వద్ద, ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం రైతులు క్వింటాకు రూ.300 నుంచి రూ.500 వరకు నష్టపోతున్నారు. ఈసారి పెట్టుబడి పెరిగిందని, దిగుబడి కూడా సరిగా రాలేదని రైతులు అంటున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే రైతులకు మద్దతు ధర అందే అవకాశం ఉంది. వ్యాపారులు కూడా మార్కెట్‌కు వచ్చిన ధాన్యం కొంటానికి పోటీ పడి ఎక్కువ ధర చెల్లిస్తారని రైతులు అంటున్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



మార్కెట్‌కు 60 బస్తాల ధాన్యం తీసుకొచ్చాను. క్వింటాకు రూ.1,890 ధర పలికింది. గ్రామాల్లోనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రూ.2,320 మద్దతు ధర దక్కేది. వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి.
– సోమ్లా, ధర్మాపురం, పాలకుర్తి, జనగామ జిల్లా

క్వింటాకు రూ.1,770 ధర వచ్చింది



వరికోతలు ప్రారంభమై పది రోజులవుతోంది. ప్రభుత్వం మాత్రం గ్రామాల్లో ఇంకా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించ లేదు. దీంతో తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం తీసుకొచ్చాను. క్వింటాకు రూ.1,770 ధర పడింది.
– చిలువేరు వీరన్న, ముత్తారం, పాలకుర్తి, జనగామ జిల్లా

ఇక.. 'పోలీస్ ప్రజా భరోసా'

- ప్రతిఒక్కరినీ సన్మార్గంలో నడిపించడమే లక్ష్యం
- గొడవలు సృష్టించే వారిపై పక్కా నిఘా
- ప్రత్యేక కార్యక్రమానికి ఎస్పీ నరసింహ శ్రీకారం
- గ్రామాల్లో ప్రతి బుధవారం కార్యక్రమం



మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేట టౌన్: గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరినీ సన్మార్గంలో నడిపించాలనే లక్ష్యంతో జిల్లా ఎస్పీ నరసింహ పోలీస్ ప్రజా భరోసా పేరుతో బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామాల్లో ప్రతి బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ సామాజిక అంశాలు, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

ప్రతి బుధవారం ఒక గ్రామాన్ని ఎంచుకొని..

జిల్లా వ్యాప్తంగా మొత్తం ఎనిమిది సర్కిళ్లు ఉండగా అందులో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక గ్రామాన్ని ఎంచుకొని ఆ గ్రామంలో డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు అందుబాటులో ఉండేలా చూస్తూ ప్రతి బుధవారం పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు గ్రామ పోలీస్ అధికారి పనిచేస్తారు. అలాగే ఎస్పీ కూడా ప్రతివారం ఏదో ఒక గ్రామంలో ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు.

అవగాహన కల్పించే అంశాలు ఇవే..

- ప్రతిఒక్కరూ చట్టానికి లోబడి నడుచుకునేలా చట్టాల గురించి తెలపడం.
- పోలీసులు మీ భద్రత కోసం ఉన్నారని, ఇతరుల ఆస్తులపై దాడులు చేయవద్దని వివరించుట.
- సమాజంలో అవగాహన లోపం వల్ల నేరాలకు పాల్పడి జీవితాలను జైలుపాలు చేసుకోవద్దు అనే విషయాలను తెలుపుట.
- గ్రామాల్లో అలజడి వాతావరణం, సమస్యలు సృష్టించే వారిలో మార్పు తీసుకురావడం.
- సామాజిక సమస్యలను గుర్తించి వాటిని నిర్మూలించడం కోసం, తద్వారా గ్రామాల్లో శాంతియుత వాతావరణం కల్పించుట.
- సమస్యాత్మక గ్రామంగా పోలీస్ రికార్డ్‌లో ఒకసారి పేరు నమోదైతే ఎప్పటికీ అలాగే నిలిచిపోతుందని అవగాహన పర్చుట.
- ఒక వ్యక్తిపై రౌడీ షీటర్, సస్పెక్ట్ షీటర్‌గా పోలీస్ రికార్డ్‌లో నమోదైతే జీవితకాలం ముద్ర అలాగే ఉంటుందని వివరించుట.
- మహిళలను గౌరవించాలి, మహిళలు, పిల్లలను వేధిస్తే కేసులు నమోదు చేసి జీవితకాలం శిక్షలు పడేలా పోలీసు దర్యాప్తు ఉంటుందని వివరించుట.
- అపరిచితులు ఫోన్, సోషల్ మీడియా ద్వారా, మెసేజ్ ల ద్వారా తెలిపితే నమ్మి అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకోవద్దని చెప్పడం.
- బెట్టింగ్‌లు పెట్టవద్దని పేర్కొనడం.
- రోడ్డు ప్రయాణ సమయంలో జాగ్రత్తగా ఉండాలి, మద్యం తాగి వాహనాలు నడపొద్దు, పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని సూచించడం.
- గంజాయి లాంటి మాదకద్రవ్యాలు గ్రామాల్లోకి రానివ్వద్దని, ఎవరైనా డ్రగ్స్‌కు అలవాటు పడితే పోలీసులకు సమాచారం ఇవ్వడంతోపాటు ఇతర సామాజిక అంశాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

యువతలో మార్పు కోసమే : ఎస్పీ నరసింహ

గ్రామాల్లోని యువత చెడుమార్గంలో వెళ్లకుండా వారు సన్మార్గంలో వెళ్లేలా మార్పుతేవడం కోసమే పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమం ప్రారంభించామని ఎస్పీ నరసింహ అన్నారు. బుధవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేరాల్లో చిక్కుకోవడం వల్ల యువత భవిష్యత్తులో ఉద్యోగాలు పొందే, విదేశాలకు వెళ్లే, పైచదువుల విషయంలో సమస్యలు వస్తాయన్నారు. ఏ వ్యక్తిపై అయినా ఒకసారి రౌడీ షీట్, సస్పెక్ట్ షీట్ లాంటివి నమోదైతే జీవితాంతం ఆ మచ్చ అలాగే ఉంటుందని తెలిపారు. సైబర్ మోసాల బారిన పడి డబ్బు పోగొట్టుకుంటున్న, మత్తు పదార్థాలకు బానిసలై యువత మంచి భవిష్యత్తును కోల్పోవడం వంటి అంశాలపై ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

కోదాడ: ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం హెచ్చరించారు. బుధవారం కోదాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అనుమతి కోసం సమర్పించిన పత్రాలు, సౌకర్యాలను పరిశీలించారు. ఆసుపత్రి నిర్వాహకులు మారితే వెంటనే ప్రభుత్వానికి తెలియజేసి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా ఆసుపత్రులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి ఆసుపత్రిలో అందిస్తున్న వైద్యసేవలతో పాటు ధరల పట్టికను ప్రదర్శించాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయ మనోహరి ఉన్నారు.



ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

అర్జీదారులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి



రేషన్ దుకాణంలో సన్న బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

భానుపురి: రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, డీపీఎంలు, ఏపీఓలు, ఇతర అధికారులతో రాజీవ్ యువ వికాస పథకం అమలు, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్, పెన్షన్లు, సెర్ప్, ఇందిరమ్మ ఇళ్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సోలార్ విలేజ్ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా మునగాల మండలం ఎంపీడీఓ దార శ్రీనివాసరావు అకాల మరణంపై కలెక్టర్ సానుభూతిని వ్యక్తం చేసి ప్రభుత్వం తరఫున అతని కుటుంబానికి పూర్తి సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాస పథకం ద్వారా జిల్లాలో అర్హులైన నిరుద్యోగ యువతీయువకులకు యూనిట్లు అందేలా చూడాలన్నారు. ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయడంతో పాటు సలహాలు సూచనల కోసం సిబ్బందిని నియమించాలని సూచించారు. జిల్లాకు మంజూరైన 4,549 ఇందిరమ్మ ఇళ్లను ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో అర్హత ఉన్నవారికి మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. 5వేలకు మించి జనాభా ఉన్న గ్రామాల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్‌డీఓ వీవీ.అప్పారావు, ఎంపీడీఓలు, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

1.24 లక్షల మంది లబ్ధిదారులకు సన్న బియ్యం

ప్రతిఒక్కరూ రోజు సన్న బియ్యం బువ్వ తినాలన్న ఆకాంక్షతో ప్రభుత్వం చేపట్టిన సన్నబియ్యం పథకంలో భాగంగా రెండు రోజులుగా జిల్లావ్యాప్తంగా 1.24 లక్షల మంది లబ్ధిదారులకు 2,500 మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని పంపిణీ చేసినట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం సూర్యాపేటలోని 14వ నంబర్ రేషన్ షాపును అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి ఆయన సందర్శించారు. సన్న బియ్యం నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం షాపులో ఉన్న స్టాక్, బియ్యం నాణ్యత, ఈ–పాస్ మిషన్‌లో జరుగుతున్న లావాదేవీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కలెక్టర్ వెంట డీటీ నాగలక్ష్మి, రేషన్ డీలర్ అన్నపూర్ణ తదితరులు ఉన్నారు.

గోదావరి జలాలు విడుదల



బయ్యన్నవాగు నుంచి జిల్లాకు వస్తున్న గోదావరి జలాలు

అర్వపల్లి: వరి పొలాలు ఎండిపోతుండడంతో రైతుల విన్నపం మేరకు నీటి పారుదల శాఖ అధికారులు బుధవారం జనగామ జిల్లా బయ్యన్న వాగు నుంచి జిల్లాకు వెయ్యి క్యూసెక్కుల గోదావరి జలాలను విడుదల చేశారు. అయితే ఈ యాసంగి సీజన్‌కుగాను షెడ్యూల్ ప్రకారం ఇప్పటికే ఆరు విడుతలుగా నీటిని వదిలారు. షెడ్యూల్ పూర్తికావడంతో గత నెల 24న జిల్లాకు నీటిని నిలిపివేశారు. దీంతో నీరు సాలక వరిచేలు ఎండిపోతున్నాయి. మరో పది రోజుల్లో వరి పంటలు చేతికందుతాయని, మరో విడత నీరు అందించాలని అధికారులకు రైతులు విన్నవించడంతో నీటిని వదిలారు. వదిలిన వెయ్యి క్యూసెక్కుల నీటిలో 69 డీబీఎంకు 300, 70డీబీఎంకు 50, 71డీబీఎంకు 630 క్యూసెక్కుల చొప్పున నీటిని ఇస్తున్నారు. రైతులు ఈ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని నీటిపారుదల శాఖ డీఈఈ ఎం.సత్యనారాయణ కోరారు.

రోడ్డును ఆక్రమించి పక్కా నిర్మాణం



కోదాడ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోడ్డు స్థలంలో చేపడుతున్న నిర్మాణం

కోదాడ: పట్టణంలో రోడ్డు ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతుంటే.. కొందరు మాత్రం ప్రధాన రహదారినే ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపడుతున్నారు. కోదాడ ప్రభుత్వ ఆసుపత్రి ముందు మురుగు కాలువ మీద కొందరు చిన్న డబ్బాకొట్లను ఏర్పాటు చేసి వాటిని అద్దెకు ఇస్తున్నారు. ఇటీవల మురుగు కాలువలో పూడిక తీయడానికి కాలువపై ఉన్న డబ్బాకొట్లను మున్సిపల్ యంత్రాంగం తొలగించింది. పూడిక తీసిన తరువాత కొందరు చిన్న డబ్బాకొట్ల స్థానంలో మురుగుకాలువ దాటి దాదాపు 10 అడుగుల మేర ప్రధాన రహదారి మార్జిన్ ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిపోయే రోగులు, వారి బంధువుల వాహనాల పార్కింగ్‌కు స్థలం లేక ఇబ్బంది తీవ్ర పడుతున్నారు. రోడ్డు ఆక్రమించి పక్కా నిర్మాణం చేపడుతున్నా ఇటు, మున్సిపల్, అటు ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంపై పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

పొలాల వద్దకు 'ఉపాధి' బాటలు

- 2 నుంచి 5 కిలోమీటర్ల వరకు మట్టి రోడ్లు నిర్మించేలా చర్యలు
- పురోగతిలో 627 రోడ్ల పనులు
- మిగిలిన పనులు ఏప్రిల్‌లోగా పూర్తిచేసేందుకు ప్రణాళిక



లక్ష్మాపురంలో మట్టిరోడ్డు పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

మంజూరైన మట్టి రోడ్లు	పనులు చేపట్టినవి
1,786	627
విడుదలైన నిధులు	ఖర్చుచేసిన నిధులు
రూ.119 కోట్లు	రూ.48.60 కోట్లు

నాగారం: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు తమ పంట పొలాలకు వద్దకు వెళ్లేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మట్టి రోడ్లు నిర్మిస్తున్నారు. జిల్లాలోని 23 మండలాల్లో 1,786 రోడ్లు మంజూరుకాగా, ప్రస్తుతం 627 రోడ్ల పనులు కొనసాగుతున్నాయి. ఆయా పనులకు రూ.119 కోట్లు మంజూరు కాగా ఇందులో రూ.48.60 కోట్ల పనులు పూర్తి చేశారు. మిగతా పనులు మార్చి నెలాఖరులోపు పూర్తి చేయాల్సి ఉంది. కానీ పనుల్లో జాప్యం వల్ల పూర్తికాని పనులను రీ షెడ్యూల్ చేసి ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తి చేసేలా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ప్రణాళికా సిద్ధం చేశారు.


తీరనున్న అవస్థలు

వర్షాకాలంలో రైతులు తమ పంట పొలాలకు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ప్రతి మండలంలో కనీసం 2 కి.మీ. నుంచి 5 కి.మీ. దూరం మట్టి రోడ్డు నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఈ పనుల్లో కూలీలకు 60 శాతం, 40 శాతం మెటీరియల్‌కు ఖర్చు చేస్తున్నారు. కిలోమీటర్ దూరం రోడ్డు నిర్మాణానికి దాదాపు రూ.2 లక్షలు కూలీలకు, రూ.1.10 లక్షలు మెటీరియల్ కింద వ్యయం చేసే అవకాశముంది. కూలీలు కందకాలు తవ్వి రోడ్డుపై మట్టి పోస్తుండగా, గుంతలు నింపేందుకు ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాల నుంచి మొరాన్ని తరలించి చదును చేయనున్నారు.

ఊపందుకున్న ఉపాధి పనులు..

జిల్లాలో ఉపాధి హామీ పనులు ఊపందుకుంటున్నాయి. జిల్లాలోని 475 గ్రామ పంచాయతీలు ఉండగా ఇప్పటికే ఉపాధిహామీ పనులు ప్రారంభమయ్యాయి. జిల్లాలో 2.62లక్షల జాబ్‌కార్డులు ఉండగా, వీటి పరిధిలో 5.70 లక్షల మంది కూలీలుగా నమోదై ఉన్నారు. కాగా వీరిలో ప్రస్తుతం పనులకు వెళ్తున్న కూలీలు 37,775గా ఉన్నారు. వచ్చే ఏప్రిల్, మే నెలల్లో ఈ సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రస్తుతం ఇంకుడు గుంతలు, పశువుల షెడ్ల నిర్మాణం, కోళ్ల షెడ్లు, నీటి తొట్లు, నీటి నిల్వ వసతులు, నర్సరీల ఏర్పాటు, చెక్ డ్యామ్‌లు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పంట పొలాలకు రోడ్ల అనుసంధానం, నీటికుంటల నిర్మాణం, వనమహోత్సవంలో పండ్ల తోటల పెంపకం, నర్సరీల్లో మొక్కల సంరక్షణ పనులు చేపడుతున్నారు.

రైతులకు ప్రయోజనకరం



ఉపాధి హామీ పథకం ద్వారా పొలాల వద్దకు వెళ్లేందుకు నిర్మిస్తున్న మట్టి రోడ్లతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. కూలీలకు కూడా ఉపాధి లభిస్తుంది. పనుల కోసం కేటాయించిన నిధుల్లో 60 శాతం కూలీలకు, 40 శాతం మెటీరియల్ కింద ఖర్చు చేయనున్నాం.
– వీవీ.అప్పారావు, డీఆర్‌డీఓ, సూర్యాపేట

సర్వాయి పాపన్నను స్ఫూర్తిగా తీసుకోవాలి



పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్ తదితరులు

భానుపురి: సమాజంలోని అన్యాయాలపై ధైర్యంగా పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్నను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. బుధవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. సామాజిక న్యాయం కోసం పాపన్న చేసిన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, జెడ్పీ సీఈఓ అప్పారావు, సంక్షేమ అధికారులు శ్రీనివాస్ నాయక్, శంకర్, లత, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

అడ్డగూడూరు: మానసికస్థితి సరిగా లేని మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన అడ్డగూడూరు మండలం చౌల్ల రామారం గ్రామంలో బుధవారం జరిగింది. వివరాలు.. మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన ఆరె సత్తమ్మ(55)కు కొంతకాలంగా మానసికస్థితి సరిగా ఉండటంలేదు. దీంతో పాటు ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. మంగళవారం ఉదయం ఆమె అదే గ్రామంలోని తన కుమార్తె పంగ రేవతి ఇంటికి వెళ్లింది. బుధవారం ఉదయం కుమార్తె కూలీ పనికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో సత్తమ్మ చీరతో ఉరేసుకుంది. సత్తమ్మ మనవడు స్కూల్ నుంచి వచ్చి చూసేసరికి అమ్మమ్మ ఉరికి వేలాడుతుండడంతో కేకలు వేశాడు. చుట్టుపక్కల వారు వచ్చే చూసేసరికి సత్తమ్మ మృతిచెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమార్తె రేవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

తిప్పర్తి: పదో తరగతి పరీక్షలు పూర్తికావడంతో గురుకుల పాఠశాలలో చదువుతున్న తన కుమారుడు తీసుకురావడానికి బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటన తిప్పర్తి మండల కేంద్రంలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ సాయి ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి(సాగర్) మండలం బోయగూడ గ్రామానికి చెందిన వంగూరి శ్రీనివాస్ (42) కుమారుడు సూర్యాపేట జిల్లా అర్వపల్లిలోని గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. బుధవారం పదో తరగతి పరీక్షలు పూర్తికావడంతో తన కుమారుడిని స్వగ్రామానికి తీసుకురావడానికి శ్రీనివాస్ బైక్‌పై వెళ్తుండగా.. తిప్పర్తి మండల కేంద్రం సమీపంలోని తిప్పలమ్మగూడం వద్ద రోడ్డు క్రాస్ చేసే క్రమంలో మిర్యాలగూడ నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి బావమరిది అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పూడ్చిపెట్టిన మృతదేహానికి పోస్టుమార్టం

దేవరకొండ: పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించిన ఘటన బుధవారం దేవరకొండ మండలంలో చోటు చేసుకుంది. సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ మండలం పద్మటిపల్లి గ్రామానికి చెందిన జహంగీర్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు షబ్బీర్ ఉన్నారు. షబ్బీర్(14) గత నెల 18న గ్రామంలో మృతిచెందాడు. అనంతరం మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. ఇదిలా ఉంటే తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని తండ్రి జహంగీర్ ఈ నెల 1న దేవరకొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు బుధవారం దేవరకొండ తహసీల్దార్ సంతోష్‌కిరణ్ సమక్షంలో వైద్యుల బృందం మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించినట్లు సీఐ పేర్కొన్నారు.

తాడువాయి పీఏసీఎస్‌లో ముగ్గురి సస్పెన్షన్

భానుపురి (సూర్యాపేట): మునగాల మండలం తాడువాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన అవకతవకలపై ప్రాథమిక నివేదిక ఆధారంగా పీఏసీఎస్ కార్యదర్శి ఆర్. నాగేందర్, స్టాఫ్ అసిస్టెంట్ పి. కోటయ్య, కంప్యూటర్ ఆపరేటర్ పర్వీన్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా సహకార అధికారిణి ఎస్. పద్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా వారిపై విచారణకు ఆదేశాలు జారీ చేశామని, ఈ విచారణ నివేదిక సమర్పించిన తదనంతరం తదుపరి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

‘ప్రైవేట్’లో నిలిచిన డిగ్రీ ప్రాక్టికల్స్

- నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఇవ్వని ప్రభుత్వం
- నిరసనగా ప్రాక్టికల్ పరీక్షలను బహిష్కరించిన ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు
- ప్రభుత్వ కళాశాలల్లో యథావిధిగా కొనసాగిన పరీక్షలు



కోదాడ: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి ప్రారంభం కావాల్సిన డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలు నిలిచిపోయాయి. గడిచిన నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వనందుకు నిరసనగా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలతో పాటు గడిచిన ఆరు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని వాటిల్లో పనిచేస్తున్న అధ్యాపకులు ఈ పరీక్షలను బహిష్కరించారు. ప్రాక్టికల్ పరీక్షల కోసం కళాశాలల వద్దకు వచ్చిన విద్యార్థులకు పరీక్షలు లేవని చెప్పడంతో గందరగోళంలో పడ్డారు. ఈ పరీక్షలు మళ్లీ ఎప్పటి నుంచి నిర్వహించే విషయంపై యూనివర్సిటీ ప్రకటన చేయకపోవడంతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. ప్రైవేట్ కళాశాలలు పరీక్షలు బహిష్కరించగా, ప్రభుత్వ కళాశాలల్లో మాత్రం బుధవారం యథావిధిగా జరిగాయి. పరీక్షల బహిష్కరణపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ అంటున్నారు.

వేల మంది విద్యార్థులపై ప్రభావం

మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లాలో గతంలో 118 వరకు డిగ్రీ కళాశాలలు ఉండగా ప్రస్తుతం 64 మాత్రమే ఉన్నాయి. వీటిలో 40 ప్రైవేట్ కళాశాలలు కాగా మిగిలినవి ప్రభుత్వ కళాశాలలు. విద్యార్థుల సంఖ్య కూడా 48వేల నుంచి 8వేలకు పడిపోయింది. ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు పూర్తిగా ప్రభుత్వం ఇచ్చే ఉపకార వేతనాల మీద ఆధారపడి నడుస్తున్నాయి. ప్రైవేట్‌లో చదువుతున్న విద్యార్థులకు గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం ఉపకార వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో కళాశాలల నిర్వహణ భారంగా మారడంతో పాటు అద్దెలు, కరెంట్ బిల్లులు, అధ్యాపకులకు వేతనాలు చెల్లించలేక పలు కళాశాలలు మూతపడ్డాయి. మిగిలిన కళాశాలలు కూడా తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలో మార్చి నెలలో జిల్లాలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాలు ఎంజీ యూనివర్సిటీ వీసీ అల్తాఫ్ హుస్సేన్‌ను కలిసి మార్చి 31 వరకు తమకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోతే ఏప్రిల్ 2 నుంచి జరిగే ప్రాక్టికల్ పరీక్షలతో పాటు 11నుంచి జరిగే థియరీ పరీక్షలను బహిష్కరిస్తామని స్పష్టం చేశాయి. మార్చి 31న ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో బుధవారం పరీక్షలు నిర్వహించలేదు.

వేతనాలు ఇవ్వలేక పోతున్నాం



నాలుగేళ్లుగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో అధ్యాపకులకు వేతనాలు ఇవ్వలేక పోతున్నాం. వారితో పనిచేయించలేక పోతున్నాం. బుధవారం 2, 4, 6 సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలు బహిష్కరించాం. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు పరీక్షలు నిర్వహించలేం. 11 నుంచి జరగనున్న థియరీ పరీక్షలనూ బహిష్కరిస్తాం.

– సిరికొండ శ్రీనివాస్, ప్రిన్సిపాల్, త్రివేణి డిగ్రీ కళాశాల, కోదాడ

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



నాలుగు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కనీసం భవనాల అద్దెలు కూడా చెల్లించలేకపోతున్నాం. అధ్యాపకులకు వేతనాలు ఇవ్వకపోవడంతో వారు సహకరించడంలేదు. జిల్లాలో అన్ని కళాశాలలకు రూ.120 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ రావాలి. ప్రభుత్వం మార్చి 31 వరకు కొంత ఇస్తామని ఇవ్వలేదు. తప్పనిసరి పరిస్థితిలో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. విద్యార్థుల తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలి.

– మారం నాగేందర్‌రెడ్డి, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి 2, 4, 6 సెమిస్టర్‌ల ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఈ పరీక్షలను బహిష్కరించాయి. ప్రభుత్వ కళాశాలల్లో యథావిధిగా పరీక్షలు జరిగాయి. వీటిపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ నెల 11 నుంచి థియరీ పరీక్షలున్నాయి. అప్పటి వరకు యూనివర్సిటీ ఉన్నతాధికారులు తగిన నిర్ణయం తీసుకుంటారు.

– ఉపేందర్‌రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్, ఎంజీయూ

ఈతకు వెళ్లి బీటెక్ విద్యార్థి మృతి

- మరొకరు గల్లంతు
- భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖి పరిధిలో ఘటన



గందె జతిన్



బొడ్డు శ్యాంచరణ్ (ఫైల్)



ప్రమాదం జరిగిన క్వారీ గుంత ఇదే

భూదాన్‌పోచంపల్లి: క్వారీ గుంతలో ఈతకు వెళ్లి బీటెక్ విద్యార్థి మృతిచెందాడు. మరొక విద్యార్థి గల్లంతయ్యాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖి పరిధిలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మియాపూర్‌కు చెందిన గందె జతిన్ (18), కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన బొడ్డు శ్యాంచరణ్ (18)తో పాటు కర్మన్‌ఘాట్ న్యూగాయత్రీనగర్‌కు చెందిన చల్లా అక్షయ్‌కుమార్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన వర్థాల శ్రీమాన్‌తో పాటు భరత్ యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖిలోని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ (సీఎస్‌ఈ) ఫస్టియర్ చదువుతున్నారు. రోజు మాదిరిగానే బుధవారం ఉదయం ఇంటి నుంచి బైక్‌లపై కాలేజీకి వచ్చారు. కళాశాలలో పరీక్ష రాసిన అనంతరం మధ్యాహ్నం ఈత కొట్టేందుకు కళాశాలకు అర కిలోమీటర్ దూరంలో ఉన్న సాయివికాస్ స్టోన్ క్రషర్‌కు చెందిన నిర్మానుష్య క్వారీ వద్దకు వెళ్లారు. జతిన్, శ్యాంచరణ్ ఈత కొట్టడానికి క్వారీ గుంతలోకి దిగి ఈతరాక మునిగిపోయారు.

20 ఫీట్ల లోతు ఉన్న క్వారీ గుంత

క్వారీ గుంత 20 ఫీట్ల కంటే లోతుగా ఉంది. కానీ గుంత కొద్దిలోతే ఉందని భావించిన ఇద్దరు విద్యార్థులు అందులో దిగగానే గల్లంతయ్యారు. మునిగిపోతున్న విద్యార్థులను కాపాడండి అంటూ ఒడ్డుపైన ఉన్న మరో ముగ్గురు కేకలు వేశారు. కానీ అక్కడ ఎవరూ కూడా లేరు. అందులో ఓ విద్యార్థి ధైర్యం చేసి వారిని కాపాడేందుకు విఫలయత్నం చేశారు. కానీ కొద్ది నిమిషాల వ్యవధిలోనే కళ్లెదుటే ప్రాణస్నేహితులు నీటి మునిగి ప్రాణాలొదిరారు.

నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి..

అక్షయ్‌కుమార్‌రెడ్డి, శ్రీమాన్, భరత్ భయంతో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి జరిగిన ఘటన గురించి పోలీసులకు చెప్పారు. ఘటనా స్థలం తమ పోలీస్ స్టేషన్ పరిధిలోకి రాదని వారు పోచంపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోచంపల్లి ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని ఫైర్ సిబ్బంది సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడడంతో లైట్లు ఏర్పాటు చేసి గాలించగా.. రాత్రి 9గంటల సమయంలో బొడ్డు శ్యాంచరణ్ మృతదేహం లభ్యమైంది. చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సీఐ రాములు ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

రాజ్యాంగ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

- రాష్ట్ర వికలాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య

అనంతగిరి: భారత రాజ్యాంగ పరిరక్షణ దేశ పౌరులందరి బాధ్యత అని రాష్ట్ర వికలాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్, కోదాడ, హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాల జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ సమన్వయకర్త ముత్తినేని వీరయ్య అన్నారు. రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని అనంతగిరి మండలంలోని గోండ్రియాల, కొత్తగూడెం, లక్కారం, శాంతినగర్ గ్రామాల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ ఆశయాలను సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నాలు చేస్తోందన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువలు, ప్రజల హక్కులను పరిరక్షించడానికి దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం, ఐక్యత కల్పించేలా సంవిధాన్ బచావో రాష్ట్రీయ పాదయాత్ర చేయాలని ఏఐసీసీ నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో కొండపల్లి వాసు, గునుకుల గోపాల్‌రెడ్డి, బుర్రపుల్లారెడ్డి, మండల కార్యదర్శి నెల్లూరి వెంకటప్పయ్య, ఈదుల కృష్ణయ్య, బాబు నాయక్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



అంబేడ్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ముత్తినేని వీరయ్య తదితరులు

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి



రిజ్వాన్ (ఫైల్)

సూర్యాపేటటౌన్: బైక్‌పై వెళ్తున్న యువకుడు అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణానికి చెందిన ఖాజా ఇస్రార్ అహ్మద్ కుమారుడు ఎండీ రిజ్వాన్ (28) బైక్‌పై అతడి స్నేహితుడు ఆరిఫ్‌ను పట్టణంలోని జేజేనగర్‌లో గల తన ఇంటి వద్ద దింపేందుకు వెళ్తుండగా.. మినీ ట్యాంక్‌బండ్ సరస్వతి స్కూల్ సమీపంలోకి రాగానే ఆవులు అడ్డు రావడంతో సడన్ బ్రేక్ వేశాడు. దీంతో బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న మురుగు కాల్వలో పడి రిజ్వాన్ మృతిచెందాడు. వెనుక కూర్చున్న ఆరిఫ్‌కు గాయాలయ్యాయి. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వీరరాఘవులు తెలిపారు.

స్పిరిట్ ఉపయోగించి నకిలీ మద్యం తయారీ

- ఈ దందాలో వైన్ షాపుల యజమానులు, రాజకీయ నేతలు..?

నాంపల్లి, చండూరు: నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం గానుగుపల్లి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో మద్యం తయారీకి ఉపయోగించే స్పిరిట్‌ను మంగళవారం రాత్రి పోలీసులు పట్టుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. బుధవారం మధ్యాహ్నం నాంపల్లి ఎక్సైజ్ సీఐ షరీఫ్, సిబ్బంది, నల్లగొండ టాస్క్‌ఫోర్స్ పోలీసులు వచ్చి పరిశీలించి వెళ్లారు. వ్యవసాయ క్షేత్రంలోని రెండెకరాల కొబ్బరి తోటలో స్పిరిట్ ఉపయోగించి 1500 లీటర్లకు పైగా నకిలీ మద్యం తయారు చేస్తున్నట్లు సమాచారం. దీని వెనుక చండూరు, నాంపల్లి మండలాలకు చెందిన 15మంది రాజకీయ నాయకులతో పాటు నాంపల్లి మండలంలోని వైన్స్‌ల యజమానులు, అందులో పనిచేస్తున్న వర్కర్లు సైతం ఉన్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ క్షేత్రంలో 20 ఫీట్ల పొడవు, 4 ఫీట్ల వెడల్పుతో గొయ్యి తీసి డ్రమ్ములు, క్యాన్లలో స్పిరిట్, 12 ఫీట్ల పొడవు గుంతలో మద్యం కప్పి ఉంచినట్లు తెలుస్తోంది. నాంపల్లి, చండూరు, కనగల్, మర్రిగూడ, గుర్రంపోడు, చౌటుప్పల్, నల్లగొండ, దర్వేశిపురం, తుమ్మడం వంటి ప్రాంతాల్లో నడిచే వైన్స్‌లను ఎంచుకొని కొన్నేళ్లుగా ఈ దందా నడిపిస్తున్నట్లు సమాచారం. ఈ కల్తీ మద్యం దందా మునుగోడు ఉపఎన్నిక సమయంలో మొదలైందని, హైదరాబాద్ నుంచి చిన్న చిన్న వాహనాల్లో డ్రమ్ముల్లో స్పిరిట్‌ను తెప్పించేవారని సమాచారం. ఈ వ్యవసాయ క్షేత్రం మూడు మండలాల కూడలి కావడంతో ఎవరూ పట్టించుకునేవారు కాదని, నిత్యం అక్కడ విందులు, వినోదాలు జరిగేవని చుట్టుపక్కల భూముల వారు తెలిపారు. అయితే ఈ కేసులో పట్టుబడిన వారు ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్ నుంచి స్పిరిట్ తెప్పించటంలో కీలక పాత్ర పోషించిన చండూరు పట్టణానికి చెందిన ఓ మటన్ వ్యాపారిని కూడా పోలీసులు అరెస్ట్ చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.



మద్యం, స్పిరిట్ నిల్వ చేసిన డ్రమ్ములను పరిశీలిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

చికిత్స పొందుతూ..



నవీన్ (ఫైల్)

శాలిగౌరారం: తల్లిదండ్రులు మందలించారని మనస్తాపానికి గురై పురుగుల మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. నకిరేకల్ ఎస్‌ఐ సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. శాలిగౌరారం మండలం అడ్లూరు గ్రామానికి చెందిన కడమంచి నవీన్(23) ఇంటర్మీడియట్ వరకు చదివి ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఖాళీగా ఉంటున్న నవీన్‌ను తల్లిదండ్రులు ఏం పనిచేయడం లేదంటూ మందలించారు. ఈ క్రమంలో మార్చి 27న ఇంటి నుంచి నకిరేకల్‌కు వెళ్లిన నవీన్ నకిరేకల్‌లోని కడపర్తి రోడ్డు వెంట ఉన్న ఓ ఫంక్షన్‌హాల్ వద్ద పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి నవీన్‌ను గుర్తుపట్టి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. నవీన్‌ను నల్లగొండలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

చిరుధాన్యాలతో ఉత్పత్తుల తయారీపై శిక్షణ

గరిడేపల్లి: గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం షెడ్యూల్డ్ తెగల ఉప ప్రణాళికలో భాగంగా షెడ్యూల్డ్ తెగలకు చెందిన 30మంది మహిళలకు చిరుధాన్యాలతో విలువాధారిత ఉత్పత్తులపై మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎస్. సుగంధి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, ఇన్‌చార్జి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి. నరేష్ చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. చిరుధాన్యాలతో రాగి లడ్డు, జొన్న బిస్కెట్లు, జొన్న మురుకులు తదితర ఉత్పత్తులు తయారుచేసి వాటిని మార్కెటింగ్ చేయడంపై దృష్టిపెట్టాలని సూచించారు. మహిళలు ఒక గ్రూప్‌గా ఏర్పడి మిల్లెట్ బేకరీ యూనిట్ పెట్టుకోవాలని తెలిపారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుగంధి మాట్లాడుతూ.. మనం తినే ఆహారంలో చిరుధాన్యాలను తీసుకోవడం ద్వారా షుగర్ కంట్రోల్‌లో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడకు చెందిన రాణి ఏర్పాటు చేసుకున్న చిరుధాన్యాల బేకరీ యూనిట్ గురించిన వివరాలను మహిళలకు తెలియజేసింది.



మహిళలకు శిక్షణ ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

యాదగిరిగుట్టలో ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూజలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావు, కుటుంబ సభ్యులు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి, ముఖమండపంలో సువర్ణ పుష్పార్చనమూర్తుల చెంత అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం అందజేశారు.



ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణరావుకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

తల్లి, కుమార్తె అదృశ్యం

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని మాధవరాయినిగూడెం గ్రామానికి చెందిన తల్లి, కుమార్తె అదృశ్యమయ్యారు. బుధవారం ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మాధవరాయినిగూడేనికి చెందిన చప్పిడి ప్రియాంక గత నెల 28న తన మూడేళ్ల కుమార్తె షణ్ముఖ ప్రియని తీసుకుని నడిగూడెం మండలం రామాపురంలో ఉంటున్న తన అమ్మమ్మ లక్ష్మమ్మ వద్దకు వెళ్తున్నానని భర్త రాముకు చెప్పి అదృశ్యమైంది. ప్రియాంక, ఆమె కుమార్తె కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త రాము బుధవారం హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



కుమార్తె షణ్ముఖ ప్రియతో ప్రియాంక

కుక్కల దాడిలో జింక మృతి

మర్రిగూడ: కుక్కల దాడిలో జింక మృతిచెందిన ఘటన మర్రిగూడ మండలం సరంపేట గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జింకలు వేసవి తాపంతో దాహం తీర్చుకోవడానికి ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి సరంపేట గ్రామ శివారు నుంచి వెళ్తుండగా కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో ఒక జింక మృతిచెందింది. గ్రామస్తులు గమనించి అటవీశాఖ అధికారులు, పశువైద్యాధికారికి సమాచారం అందించారు. అటవీశాఖ అధికారుల సమక్షంలో పశువైద్యాధికారి సురేందర్ పంచనామా నిర్వహించి జింకను ఖననం చేశారు.



జింకను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

విద్యుదాఘాతంతో హార్వెస్టర్ హెల్పర్ మృతి



రాజేష్ మృతదేహం

కట్టంగూర్: విద్యుదాఘాతంతో హార్వెస్టర్ హెల్పర్ మృతిచెందాడు. ఈ ఘటన కట్టంగూర్ శివారులో మంగళవారం సాయంత్రం జరిగింది. కట్టంగూర్ గ్రామ శివారులో ఎస్. రాములుకు చెందిన వరి పంటను మంగళవారం సాయంత్రం హార్వెస్టర్(వరికోత మిషన్)తో కోస్తుండగా బోరు మోటారుకు ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు హార్వెస్టర్‌పై పడింది. హార్వెస్టర్ హెల్పర్‌గా పనిచేస్తున్న తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా ఎద్యనూర్ గ్రామానికి చెందిన రాజేష్(22) వైరును తొలగించే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. హార్వేస్టర్ డ్రైవర్, స్థానిక రైతులు వెంటనే రాజేష్‌ను బైక్‌పై నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం. రవీందర్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ బలవన్మరణం

భువనగిరిటౌన్: ఆర్థిక ఇబ్బందులతో గడ్డి మందు తాగిన ఆటో డ్రైవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన తుర్కపల్లి మండలం వెలుపల్లిలో బుధవారం జరిగింది. వెలుపల్లికి చెందిన పబ్బు శ్రవణ్‌కుమార్‌గౌడ్ (30) భువనగిరి పట్టణంలోని తాతానగర్‌కు వచ్చి అక్కడే నివాసముంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో గిరాకీ లేక కుటుంబ పోషణ భారంగా మారింది. ఆర్థిక ఇబ్బందులతో వారం క్రితం భువనగిరి బస్టాండ్ వెనుక ఆటో స్టాండ్‌లో గడ్డి మందు తాగాడు. తోటి డ్రైవర్లు గమనించి భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రవణ్‌కుమార్‌గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల ఆర్థికసాయం అందజేయాలని తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ జేఏసీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కొమ్ము జగదీష్ డిమాండ్ చేశాడు. ఈ మేరకు బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

డాక్టర్స్ కాలనీ

- వైద్య విద్య అభ్యసిస్తున్న ఒకే కాలనీకి చెందిన తొమ్మిది మంది విద్యార్థులు
- వీరంతా సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారే..
- ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనే చదువు

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని విద్యానగర్ కాలనీ పేరుకు తగ్గట్టుగానే విద్యావంతుల కాలనీగా నిలుస్తోంది. ఈ కాలనీ పరిధిలో సుమారు 300 నివాస గృహాలు ఉండగా.. అందులో ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు అత్యధికంగా ఉన్నారు. వారి పిల్లల్లో కూడా చాలా మంది ఉన్నత విద్యావంతులే. ఈ కాలనీ మరో ప్రత్యేకతను కూడా సొంతం చేసుకుంది. కాలనీకి చెందిన తొమ్మిది మంది విద్యార్థులు ప్రస్తుతం వైద్య విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో అత్యధికంగా ఎంబీబీఎస్ విద్యార్థులే ఉన్నారు. వైద్య విద్యనభ్యసిస్తున్న విద్యార్థులంతా సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారే కావడం విశేషం. ఇటీవల విద్యానగర్ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వైద్య విద్యనభ్యసిస్తున్న విద్యార్థులను ఘనంగా సన్మానించారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే..

వైద్య విద్యనభ్యసిస్తున్న తొమ్మిది మంది విద్యార్థులు కూడా రంగారెడ్డి, మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్, సంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరిలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనే సీట్లు సాధించారు. కాలనీకి చెందిన సూరోజు నిఖిల్, కొత్త శివకుమార్, దర్శనం వంశీకిరణ్ ఎంబీబీఎస్ పూర్తిచేసి ప్రస్తుతం పీజీ చేస్తుండగా.. కందగట్ల రమ్య (ఎంబీబీఎస్–తృతీయ సంవత్సరం), బైరు మౌనిక (ఎంబీబీఎస్–ప్రథమ సంవత్సరం), అంబటి రిషికాశివాణి(బీడీఎస్–పీజీ), దాసోజు శ్రీజ(బీడీఎస్–తృతీయ సంవత్సరం), చొల్లేటి సిరి (బీడీఎస్–ద్వితీయ సంత్సరం), బోయ సూర్యవికాస్ (ఆయుర్వేదిక్) చదువుతున్నారు.



విద్యానగర్ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సన్మానం పొందిన వైద్య విద్యార్థులు

వైద్య వృత్తిలో మంచి పేరు సాధిస్తా



నా ఎంబీబీఎస్ పూర్తయ్యింది. ప్రస్తుతం పీజీ చేస్తున్నాను. మాది సామాన్య మధ్యతరగతి కుటుంబం. తల్లిదండ్రులు నన్ను ఎంతో కష్టపడి చదివిస్తున్నారు. చదువు పూర్తయ్యాక డాక్టర్‌గా మెరుగైన వైద్యం అందించి మంచి పేరు సాధిస్తా. విద్యానగర్ కాలనీకి మంచి పేరు తీసుకొచ్చేలా వృత్తిలో రాణిస్తాను.

– సూరోజు నిఖిల్, పీజీ

అమ్మానాన్నల నమ్మకాన్ని నిలబెడతా



మాది మధ్యతరగతి కుటుంబమే అయినా చదువులకు అయ్యే ఖర్చుల విషయంలో మాత్రం మా అమ్మానాన్న ఎటువంటి లోటు రానివ్వలేదు. నా తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెడతా. డాక్టర్‌గా స్థిరపడడమే కాకుండా పేద రోగులకు సైతం నా వంతు బాధ్యతగా సేవలందిస్తాను.

– దాసోజు శ్రీజ, బీడీఎస్ తృతీయ సంవత్సరం

నాన్న స్ఫూర్తితో వైద్య వృత్తి వైపు..



మా నాన్న కందగట్ల సంజీవ చౌటుప్పల్‌లోనే ప్రైవేట్ ఫిజియోథెరపిస్ట్‌గా పనిచేస్తున్నారు. అమ్మ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. మా నాన్నను స్ఫూర్తిగా తీసుకొని వైద్య వృత్తిలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నాను. కాలనీలో మా జూనియర్లు సైతం వైద్య విద్యనభ్యసించేలా ప్రోత్సహిస్తాను. ప్రజలకు వైద్య సేవలు అందించడం గొప్ప వరం. ఆ అవకాశం నాకు రావడం అదృష్టంగా భావిస్తున్నాను.

– కందగట్ల రమ్య, ఎంబీబీఎస్ తృతీయ సంవత్సరం